ఫీజు ఫుల్.. రక్షణ నిల్..

- థియేటర్ల వద్ద కనిపించని పార్కింగ్ షెడ్లు
- రంగు మారుతున్న వాహనాలు
- ఆవిరైపోతున్న పెట్రోల్
- పట్టించుకోని యాజమాన్యాలు

బోట్‌క్లబ్: మూడు గంటల ఆనందం కోసం సినిమా థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకుల వాహనాలకు రక్షణ కరువైంది. థియేటర్ల వద్ద పార్కింగ్ ఫీజులు భారీగా వసూలు చేయడమే తప్ప వాహనాలకు నీడ కల్పించడంలేదు. దీంతో వాహనాలు పాడవడంతో పాటు వాహన యజమానులు జేబులు గుల్ల వుతున్నాయి. కాకినాడ నగరంలో 16 సినిమా థియేటర్లు ఉన్నాయి. పార్కింగ్ రుసుం వసూలు చేస్తున్న థియేటర్ యాజమాన్యం వాహనాలకు మాత్రం ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోవడంలేదు. కనీసం నీడ కూడా ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు ఎండలో ఎండుతూ, వానలో తడుస్తున్న ఉంటున్నాయి. ఎంటువంటి రక్షణ కల్పించక పోయినప్పుడు వాహనాల పార్కింగ్ రుసుం ఎందుకు ఇవ్వాలని ప్రేక్షకులు ప్రశ్నిస్తున్నారు. మూడు గంటల సేపు వాహనం పార్కింగ్ చేస్తే బైక్‌కు రూ.20, కారుకి రూ.30 వసూలు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు ప్రకారం వాహనాలకు రక్షణకు షెడ్లు ఏర్పాటు చేయాలి, కానీ థియేటర్‌లోని బహిరంగ ప్రదేశంలో పార్కింగ్ చేయిస్తున్నారు. నగరంలో రెండు, మూడు థియేటర్లు మినహా అన్ని థియేటర్ల లోను పార్కింగ్‌లో పెట్టిన వాహనాలకు ఎటువంటి రక్షణ లేదు. దీనికి తోడు ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉండడంతో కార్లలోను, ద్విచక్ర వాహనాల్లోను పెట్రోల్ ఆవిరైపోతోంది. అంతేకాక ఎండలో ఉండడం వల్ల కార్ల రంగు పాడవుతోందని కార్ల యజమానులు వాపోతున్నారు. పార్కింగ్ రుసుం రూ.30 తీసుకుంటున్న యజమానుల ఎందుకు కార్లకు రక్షణకు షెడ్లు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించినా వారి దగ్గర నుంచి సరైన సమాధానం



థియేటర్లలో ఎండలో ఉన్న ద్విచక్ర వాహనాలు



నగరంలో థియేటర్ వద్ద ఎండలో కార్లు

రావడంలేదు.

సగానికి పైగా థియేటర్లు పార్కింగ్ లీజుకే...

నగరంలో ఉన్న థియేటర్లలో సగానికి పైగా పార్కింగ్ రుసుం వసూలు చేసుకునేందుకు బయట వ్యక్తులకు సంవత్సరాల లెక్కన లీజుకు ఇస్తున్నారు. దీంతో లీజుకు తీసుకొన్న వ్యక్తి అక్కడ బయట సిబ్బందిని పెట్టుకొని ప్రేక్షకుల జేబులు ఖాళీ చేస్తున్నారు. పార్కింగ్ రుసుం తరచూ పెంచుతున్నా థియేటర్ల యాజమన్యం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. ద్విచక్ర వాహనాల్లో నిండుగా పెట్రోల్ పోయించుకొని థియేటర్‌కు వెళితే దానిలో పెట్రోల్ పూర్తిగా ఉంటుందన్న నమ్మకం లేదు. థియేటర్లలో పనిచేసే సిబ్బంది ప్రేక్షకులు థియేటర్‌లోనికి వెళ్లగానే తమ చేతికి పనిచెబుతున్నారన్న ఆరోపణలు అనేకం. ఈ విషయంపై అనేకమార్లు థియేటర్లు వద్ద ప్రేక్షకులు పార్కింగ్ సిబ్బందితో వాగ్వివాదానికి సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ విషయంపై థియేటర్ యజమాన్యానికి ఫిర్యాదు చేసిన పార్కింగ్ విషయం మాకు సంబంధం లేదని చేతులు దులుపుకుంటున్నారు.

పాడవుతున్న వాహనాలు



ఎండలో బైక్ గంటలు తరబడి ఉండడం వల్ల పెట్రోల్ ఆవిరైపోతుంది. ఇంజిన్ కూడా పాడైపోతోంది. వాహనాలు సాధ్యమైనంత వరకూ నీడలో పార్కింగ్ చేసుకోవాలి. ఎక్కువ సేపు ఎండలో వాహనాలు పార్కింగ్ చేయకూడదు.

– కె.శ్రీను, బైక్ మెకానిక్

రక్షణ లేనిది డబ్బులెందుకు?



మా వాహనాలకు ఎటువంటి రక్షణ లేకుండా ఎండలో వదిలివేస్తున్నారు. ఈ మాత్రం దానికి రూ.20 వసూలు చేయడం ఎందుకు. పార్కింగ్ రుసుం పేరుతో లక్షలు గడిస్తున్న యజమానులు వాహనాలకు రక్షణ లేకుండా చేయడం దారుణం. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గొల్లపల్లి శివ, ప్రేక్షకుడు

చెరువుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి
- అధికారులు, విద్యార్థులకు శిక్షణ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న చెరువులను అభివృద్ధి చేసి, వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. జాతీయ వాటర్ మిషన్ ఆర్థిక సహాయంతో కాకినాడలోని జాతీయ జల విజ్ఞాన సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో చెరువులు, సరస్సులను ప్రకృతి సిద్ధంగా ఎలా అభివృద్ధి పరచాలి అనే అంశంపై అధికారులకు, విద్యార్థులకు ఐదు రోజులపాట ఇవ్వనున్న శిక్షణను సోమవారం ఆమె ప్రారంభించారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి మాట్లాడుతూ కాకినాడ జిల్లాలోని నిరుపయోగంగా ఉన్న చెరువులను గుర్తించామన్నారు. పనికి ఆహార పథకంలో ఈ చెరువును అభివృద్ధి చేస్తున్నామన్నారు. కోర్సు కో ఆర్డినేటర్, సైంటిస్టు వైఆర్ సత్యాజీరావు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా చెరువులను, సరస్సులను ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చునో వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా అనుభవజ్ఞులైన పరిశోధకులను ఆన్‌లైన్ ద్వారా శిక్షణనిస్తున్నారు. తొలిరోజు దేశంలో ఉన్న చెరువులు, సరస్సుల ప్రాముఖ్యత వివరించారు. ఉత్తరాఖాండ్‌లోని హరిద్వార్ జిల్లాలోని మషాహి చెరువుపై జాతీయ జలవిజ్ఞాన సంస్థ సైంటిస్ట్ ఓంకార్ సింధూ వివరించారు. కిచెన్, బాత్‌రూమ్‌లు వచ్చే వ్యర్థాలు ఎలా శుద్ధి చేయవచ్చునో తెలిపారు. ఆ నీటి ద్వారా భూగర్భజలాలు అభివృద్ధికి, గార్డెనింగ్ కోసం ఎలా వినియోగించుకోవచ్చుననో వివరించారు. ఎటువంటి కెమికల్స్ వాడకుండా ప్రకృతి సిద్ధంగా ఉన్న పద్ధతులు ద్వారా మురుగునీరు శుద్ధీకరించే విధానాన్ని జలవిజ్ఞాన సంస్థ సైంటిస్టులు జయకాంతన్, వెంకటరమణ వివరించారు. శిక్షణలో మహారాష్ట్ర, బీహార్, తెలంగాణా, ఏపీలకు చెందిన భూగర్భజలశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, అన్నా యూనివర్సిటీ, నన్నయ్య యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి

కార్పొరేషన్‌లో స్పందన



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ కె.రమేష్

కాకినాడ: స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్ కె.రమేష్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాల్సిందిగా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకురావచ్చునన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా వినతులు అందజేయవచ్చునని చెప్పారు. స్పందన కార్యక్రమానికి డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, నగరపాలక సంస్థ మేనేజర్ కర్రి సత్యనారాయణ, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఆర్డీగా ఏడీసీకి పదోన్నతి



సీహెచ్ నాగ నరసింహారావు

కాకినాడ: స్థానిక నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావుకు పురపరిపాలన శాఖ రీజనల్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వైస్ శ్రీలక్ష్మి సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. 2019 ఫిబ్రవరిలో కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా ఇక్కడ విధుల్లో చేరిన ఆయనకు రెండేళ్ల క్రితం ఇక్కడే జాయింట్ డైరెక్టర్ పదోన్నతి లభించింది. ఇప్పుడు రీజనల్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రీజనల్ డైరెక్టర్ హోదాలో నాగ నరసింహారావు ఇక్కడే కొనసాగనున్నారు. నాగనరసింహారావును నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎస్ఈ సత్య కుమారి, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

సాగునీరు అందించాలంటూ జేసీకి వినతి

కాకినాడ సిటీ: సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే పంట పొలాలకు నీరందించాలని కోరుతూ సోమవారం స్థానిక ధర్నా చౌక్ వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో రైతులు మాట్లాడారు. తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీలో గత పదేళ్లుగా దాళ్వా సమయంలో సాగునీరు ఎద్దడి ఏర్పడి, సుమారు 600 ఎకరాల్లో పంట నష్టపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా అధికారులకు నీటి ఎద్దడిపై వినతులు ఇస్తున్నా నేటికీ పరిష్కారం కాలేదన్నారు. ఈ ఏడాదైతే నీటి ఎద్దడిని అధిగమించాలని రైతులు కోరుతున్నారు. శివారు పొలాలు బీటలు వారి ఎండిపోతున్నాయని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. నీటి ఎద్దడి ఏర్పడడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని, కాలువలు చెత్తతో పూడుకపోవడంతో నీరు సాగడంలేదన్నారు. ఇంజరం వద్ద వంతెన పాడవడంతో సిమెంటు తూరలు ద్వారా నీరు పంపించడం, సిమెంటు పైపుల్లో చెత్త అడ్డుకుపోవడంతో నీటి ప్రవాహం ఉండడంలేదని ఆవేదన చెందారు. ఇప్పటికైనా అధికారులు నీరైనా ఇవ్వాలి, పంట నష్టపరిహారం ఎకరానికి రూ.30 వేలు చెల్లించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఇలక్కియను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, గుత్తుల కృష్ణ, గుత్తుల శివ, వాసంశెట్టి రాము, గుత్తుల మహేశు, దంతులూరి సత్తిబాబు, కాకర్లపూడి రాంబాబు, పేరాబత్తుల సాయినరేంద్ర, మాగాపు సత్తిబాబు, కావూరి వెంకన్న, ఎం.డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కౌలు రైతులు

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి చర్యలు

కరప: మండల పరిధిలోని ఏడాది వయస్సు నంచి 19 ఏళ్ల వయసున్న వారందరికీ నులిపురుగుల నివారణకు డీఈసీ మాత్రలు పంపిణీకి అన్ని చర్యలు తీసుకున్నట్టు కరప పీహెచ్‌సీ వైద్యులు ఆర్.శ్రీనివాస్‌నాయక్ సోమవారం తెలిపారు. కరప పీహెచ్‌సీ పరిధిలో 12 గ్రామ సచివాలయాలు ఉండగా వాటి పరిధిలో 42 పాఠశాలలు, 46 అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో 7,912 మంది 19 ఏళ్లలోపు వయసున్న వారు ఉన్నారన్నారు. మంగళవారం వీరందరితో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తామన్నారు. ఆయా సెంటర్లకు మాత్రలు పంపించామని వైద్యులు శ్రీనివాస్‌నాయక్ తెలిపారు.

వేళంగిలో : వేళంగి పీహెచ్‌సీ పరిధిలోని 9 గ్రామ సచివాలయాల్లో 31 పాఠశాలలు, ఒక కళాశాల, 39 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని డాక్టర్ ఎంకే సౌజన్య తెలిపారు. ఎన్‌డీడీ ప్రోగ్రాంలో తమ పరిధిలో 19 ఏళ్ల లోపు వయసున్న వారు 4,320 మంది ఉన్నారని, వారికి మాత్రలు అందిస్తున్నామని తెలిపారు.

ఆర్థిక క్రమశిక్షణ లోపిస్తే కుటుంబంలో అశాంతి



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్స్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణరాజు

కాకినాడ రూరల్: ఆర్థిక క్రమశిక్షణ లోపిస్తే కుటుంబంలో అశాంతి, పోషణలో ఇబ్బందిలోస్తాయని, బాల్యం నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలని సీనియర్ సిటీజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణరాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నేటి యువతకు కనీస అవసరాలకు, విలాసాలకు మధ్య వ్యత్యాసం తెలియడం లేదని, ఆదాయంలో కొంత సొమ్మును పొదుపు చేసుకోవాలని సూచించారు. ఆర్థిక క్రమ శిక్షణ లోపిస్తే కుటుంబంలో అశాంతి, భవిషత్‌పై అనిశ్చితి, ఇంట్లో గొడవలు, కుటుంబ పోషణలో ఇబ్బందులు, పిల్లల పెంపకంలో అశ్రద్ధ వంటి సమస్యలు అనునిత్యం వెంటాడుతాయన్నారు. తద్వారా న్యాయ స్థానాలలో కేసులు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు.

అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు

- డీవైఈవో జాన్ డానియేల్ రాజు
- ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లతో సమావేశం

కాకినాడ రూరల్: విద్యాహక్కు చట్టం నిబంధనలు ప్రకారం అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేదలకు కేటాయించినట్టు కాకినాడ డీవైఈవో జాన్ డానియేల్ రాజు స్పష్టం చేశారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లతో కాకినాడ డీవైఈవో జాన్ డానియేల్ రాజు అధ్యక్షతన కాకినాడ రూరల్ ఎండీవో కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం కింద ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో (ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్)లలో 2023–24 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం మార్చి 4న ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. విద్యాహక్కు చట్టం నిబంధనలు ప్రకారం అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను కేటాయించినట్టు చెప్పారు. ఇందులో భాగంగా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వివిధ వర్గాలకు చెందిన వారు (అనాథ పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధి బాధిత పిల్లలు, దివ్యాంగుల కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఓసీలకు చెందిన పిల్లలకు 6 శాతం సీట్లు) కేటాయించినట్టు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వార్షిక ఆదాయం రూ.1,20,00లుగా, పట్టణ ప్రాంతాల్లో రూ.1,44,000 ప్రాతిపదికన తీసుకుని వారి కుటుంబాల పిల్లలు అర్హులుగా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. అన్ని పాఠశాలల రిజిస్ట్రేషన్లు ఈ నెల 6 నుంచి 16వ తేదీ వరకూ, విద్యార్థుల ప్రవేశానికి రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకూ అవకాశం ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈవో ఎల్.గణేష్‌బాబు, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో జాన్ డానియేల్ రాజు

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

కాకినాడ రూరల్: స్థానిక 48వ డివిజన్ ఎస్.అచ్యుతాపురం మధురానగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సోమవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మధురానగర్‌లో పార్కు నిర్మాణం, అంబేడ్కర్ విగ్రహం వద్ద విశ్రాంతి మందిరం నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గ పరిధిలోని అర్బన్ డివిజన్ల అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా స్థానికులకు కాలక్షేపం కోసం పార్కులు అభివృద్ధితోపాటు వర్షాకాలంలో ముంపు సమస్య లేకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. మధురానగర్ వాసులకు రక్షిత మంచినీరు అందుబాటులో ఉంచేలా ఆర్వోప్లాంట్‌ను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆర్వోప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

ఆశీల వేలం ఖరారు

కాకినాడ: స్థానిక నగరపాలక సంస్థ పరిధి మార్కెట్లలో ఆశీలు వసూలు చేసుకునేందుకు సోమవారం వేలం పాట నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సమక్షంలో పాట జరిగింది. 2023–24 సంవత్సరానికి సంబంధించి రూ.82.10 లక్షలకు వేలం పాట ఖరారైంది. గత ఏడాది కన్నా సుమారు రూ.2లక్షల అదనపు ఆదాయం సమకూరింది. మేకల కబేళాకు సంబంధించి 2023–24 సంవత్సరానికి 4.2 లక్షలకు పాట ఖరారు చేశారు. గతేడాదికన్నా అదనపు ఆదాయం సమకూరాయి. కాకినాడ నగరంలోని రోడ్డు మార్జిన్లలోను, గాంధీనగర్ మార్కెట్, కొత్తపేట మార్కెట్, పెద్దమార్కెట్, రమణయ్యపేట మార్కెట్, జగన్నాథపురంలలో ఆశీలు వసూలు చేయనున్నారు. వేలంపాటలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఆర్ఐలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్ డే

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో సోమవారం నేషనల్ ల్యాబ్ టెక్నీషియన్ డే ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలోని కాన్ఫరెన్సు హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ హేమలతాదేవి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రోగి ఆరోగ్య స్థితిని నిర్ధారించడంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఎంతో కీలకం అన్నారు. నిష్ణాతులైన ఎల్‌టీల సహకారంతోనే ప్రతి రోజు జీజీహెచ్‌లో వేల కొద్దీ రోగులకు నిరాటంకంగా సేవలందించగలుతున్నామన్నారు. రోగి ఆరోగ్య స్థితిని నిర్ధారించేది మీరయితే వారికి వైద్యం అందిచేది మేమని సూపరింటిండెంట్ వ్యాఖ్యానించారు. ఎల్‌టీలు జగదీష్, ఆంజనేయశర్మ, సుకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ అనిత, పాథాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాధిపతులతో పాటు ఏపీఎస్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ సేవలందించిన ఎల్‌టీలకు మెమెంటోలు బహూకరించారు.

వర్మీకంపోస్టు తయారీకి ప్రాధాన్యం

కరప: గ్రామాల్లోని ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ(ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారుచేయడానికి అధిక ప్రాధాన్యత నిచ్చి, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని మండల ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పంచాయతీ పరిధిలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి, దాని నిర్వహణ తీరును పరిశీలించారు. వర్మీకంపోస్టు తయారీపై ఈఓపీఆర్డీ పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ పారిశుధ్యం పనులు సకాలంలో నిర్వహిస్తూ తడి, పొడి చెత్తను సేకరించి, సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి, అమ్మకాలు జరిపితే పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు సూచనలు చేశారు. గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, గ్రామ కార్యదర్శి వి.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్, కార్యదర్శితో కలిసి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

క్లుప్తంగా

భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

బోట్‌క్లబ్: ఆలయాలకు వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నివాసంలో పెద్దమార్కెట్ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. 45 రోజుల పాటు జరిగే అమావాస్య ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలి రానున్నారని, దానికి అనుగుణంగా ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ తారకేశ్వరరావు, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్ వాసిరెడ్డి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక రోటరీ హాల్‌లో సోమవారం కాజులూరుకు చెందిన దివ్యాంగుడు పెంటపాటి విష్ణుమూర్తికి ట్రైసైకిల్ అందజేశారు. సత్యస్కాన్ సెంటర్ అధినేత డాక్టర్ కాదా వెంకటరమణ సమకూర్చిన ట్రై సైకిల్‌ను రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్‌రావు చేతుల మీదుగా అందించారు. రోటరీ క్లబ్ చేస్తున్న సేవలకు దాతల నుంచే కాకుండా వైద్యులు నుంచి కూడా సహకారం అందడం గొప్ప విషయమని క్లబ్ అధ్యక్షుడు జి.వి.కృష్ణప్రకాష్ అన్నారు. క్లబ్ కార్యదర్శి వద్దాది ఆదిత్య, బ్లడ్‌బ్యాంకు చైర్మన్ టివి బాలకృష్ణ, కార్యదర్శి చార్మినార్ వర్మ పాల్గొన్నారు.

దాతల సాయంతో ఆలయం మరింత అభివృద్ధి



దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ కూలర్

బోట్‌క్లబ్: దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ రాజనాల విజయసారథి తెలిపారు. దాతల సాయంతో ఆలయంలో వాటర్ ప్లాంట్, హోమశాల, షెడ్లు, వినాయకుని గుడి దగ్గర నుంచి వీరభద్రుని గుడి వరకూ షెడ్లు, గ్రేనేట్ వేయించారు. వీటిని సోమవారం ఆయన ప్రారంభించారు. వీటి నిర్మాణానికి సుమారు రూ.15 లక్షలు ఖర్చయ్యిందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదన్నారు. ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

నాటు.. నాటుకు ఆస్కార్ రావడం ఆనందం



కీరవాణితో కాకినాడకు చెందిన యువ దర్శకుడు శ్రీకృష్ణ

కాకినాడ కల్చరల్: ట్రిబుల్ ఆర్ సినిమా లోని నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావ డం చాలా సంతోషంగా ఉందని కాకినాడకు చెందిన యువ దర్శకుడు శ్రీకృష్ణ స్పందించారు. ఆ సినిమా సంగీత దర్శకులు కీరవాణి యువతను బాగా ప్రోత్సహిస్తారని. మన తెలుగు సినిమాకు ఆస్కార్ అవార్డు రావడానికి కృషి చేసిన సంగీత దర్శకులు కీరవాణికి అభినందనలు తెలిపారు. ఆయన మన తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చాటారన్నారు.

పోలీస్ స్పందనకు 50 ఫిర్యాదులు

కాకినాడ క్రైం: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 50 ఫిర్యాదులు అందాయని ఎస్పీ రవీంద్రనాథ్ బాబు తెలిపారు. వీటిలో సివిల్ వివాదాలకు చెందినవి 13, కుటుంబ తగాదాలవి 13, ఇతర సమస్యలకు చెందిన 24 ఫిర్యాదులు ఉన్నాయన్నారు.

బాలికపై లైంగిక దాడి

కాకినాడ క్రైం: బాలికపై లైంగిక దాడి జరిగిందన్న ఫిర్యాదుతో సోమవారం రాత్రి కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... కాకినాడ జగన్నాథపురానికి చెందిన పదో తరగతి చదువుతున్న బాలిక స్థానిక యువకుడిని ప్రేమించింది. వీరు ఆదివారం రాత్రి మాట్లాడుకోవాలని నిర్ణయించుకుని కలుసుకున్నారు. ఈ క్రమంలో ప్రేమికుడి వెంట అతడి స్నేహితుడు ఏటిమొగకు చెందిన కోలాటి వీరబాబు ఉన్నాడు. మాటలు ముగిసి ఎవరిదారిన వారు బయల్దేరి వెళ్లగా బాలికను వీరబాబు వెంబడించాడు. యాళ్ల వారి గరువు శ్మశాన వాటిక వద్ద బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని బాలిక ఇంట్లో చెప్పగా కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి కాకినాడ వన్ టౌన్ పోలీసులు వీరబాబుపై అట్రాసిటీ కేసుతో పాటు పోక్సో కేసు నమోదు చేశారు.